కాలుతుంది. తడి ఇసుక ఎండుతుంది. బురద గట్టిపడుతుంది. రంపం పొట్టు మండిపోతుంది. ఇవన్నీ వాటి వాటి ధర్మాలని అనుసరించి ప్రవర్తిస్తాయి. అలాగే ఏ సందర్భంలోనైనా మనుషుల చెడు లేదా మంచి సంస్కారాలు బయటపడతాయి. మన సంస్కారాల ద్వారా మనం చేసే కర్మలే మనల్ని స్వర్గానికి, లేదా నరకానికి చేర్చేవి. మరణానంతరం మనిషి గమ్యాన్ని నిర్ణయించేవి కూడా అవే. కాబట్టి చెడు సంస్కారులు నరకానికి వెళ్ళకుండా వుండటానికి గాను, బ్రతికి వున్నప్పుడే వాటిని వదిలించుకోవాలి. నరకానికి వెళ్ళకుండా కాపాడే మంచి సంస్కారాలు అలవర్చుకోవాలి."

## 106. చెడు కోసం మంచి

హైద్రాబాద్‌లోని ఇద్దరు బ్రాహ్మణులకి ఆస్త్మా వ్యాధి వుంది. చేప మందు తింటే ఆ రోగం నయం అవుతుందని వాళ్ళిద్దరూ విన్నారు. అయితే ఇద్దరూ పూర్తిగా శాకాహారులు. ఒకడు చేపని మింగడం విషయంలో సంశయించాడు. ఇంకొకడు తన మీద ఆధారపడ్డ భార్యా పిల్లలు తను ఇంకా క్షీణిస్తే ఇబ్బందికి గురవుతారని వెళ్ళి ఆ చేప మందుని మింగాడు. దాంతో అతని ఆస్త్మా పోయింది.

పాపభీతి గల రెండోవాడు చేపమందుని తినకపోవడంతో ఆ రోగం అధికం అయి ఓ తెల్లవారుఝామున ఊపిరాడక మరణించాడు. అతని భార్యా పిల్లలు అనాథలై అనేక కష్టాలకి గురయ్యారు.

మంచిపని కోసం కొంత చెడు చేసినా పాపం కాదు. కాని చెడు కోసం చేసే ప్రతీ మంచి పనీ పాపమే అవుతుంది.

## 107. పాదుకల విలువ

ఓ రాజుగారికి ఓ రోజు ఓ సందేహం వచ్చింది. తన గురువుని కలిసి అడిగాడు.